ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 9 సెప్టెంబరు 2024

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755


మొదలైన నిమజ్జన సందడి

జిల్లావ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచే వినాయక ప్రతిమల నిమజ్జన సందడి మొదలైంది. తిరుపతి, పరిసర ప్రాంతాలవారు కొందరు తమ ఇళ్లలో పూజించిన, వీధుల్లో ఏర్పాటు చేసిన మండపాల నుంచి గణేశుడి ప్రతిమలను తీసుకొచ్చి వినాయకసాగర్‌లో నిమజ్జనం చేశారు. వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్ర తీరంలోనూ బొజ్జగణపయ్య ప్రతిమల నిమజ్జన సందడి కనిపించింది.

- తిరుపతి (జీవకోన)



తిరుపతి వినాయకసాగర్ వద్ద భక్తులు, గణేశుడి ప్రతిమ నిమజ్జనం



వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో వినాయక ప్రతిమను నిమజ్జనానికి తరలిస్తున్న యువత

58.5 కిలోల గంజాయి పట్టివేత

● వేర్వేరు ప్రాంతాల్లో బాలుడితోపాటు ఏడుగురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు


గూడూరు, సెప్టెంబరు 8: జిల్లాలో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గూడూరు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా విశాఖపట్నం నుంచి చెన్నైకి వెళుతున్న బస్సులో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 30 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న గుంటూరు జిల్లాకు చెందిన సంజయ్‌కుమార్, ఉమాశంకర్, నీలయ్యలను విచారించారు. విశాఖపట్నంలో గంజాయిని కొనుగోలు చేసి చెన్నైలో విక్రయిస్తున్నట్లు తేలిందని రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

తిరుపతిలోనూ..

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8: తిరుపతిలోనూ శనివారం పోలీసులు దాడులు చేశారు. ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డి తన సిబ్బందితో కలిసి కొర్లగుంటలో గంజాయి విక్రయిస్తున్న కందాటి సాయిచందు, ఆర్.దేవరాజన్, ఎస్.హరినాథ్ సింగ్‌లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగున్నర కిలోల గంజాయితో పాటు మత్తు బిళ్లలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈస్ట్ పరిధిలో గంజాయి రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో డీఎస్పీ వెంకటనారాయణ, సీఐ రామకృష్ణ, సిబ్బంది కలసి తనిఖీలు చేశారు. బొమ్మగుంటలో ఓ బాలుడి (17) వద్ద నుంచి 21 కిలోల గంజాయి, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. బాలుడిని అదుపులోకి తీసుకున్నారు.

వెంకటగిరి రైల్వేస్టేషన్‌లో..

వెంకటగిరి టౌన్: కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లి తాలుకా విజయపురానికి చెందిన నరసింహరాజు స్టేషన్‌లో శనివారం అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి బ్యాగును తనిఖీ చేయగా మూడు కిలోల గంజాయి కనిపించడంతో స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఏవీ రమణ తెలిపారు. ఇతను ఒడిశా నుంచి తిరుపతికి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు.



బార్లపై వచ్చే రా'బడి' మాదే

వైసీపీ నేతలకిచ్చినట్టు నెలకు రూ.20లక్షలు ఇవ్వాల్సిందే

లేకుంటే ఇబ్బందులు తప్పవు

బార్ల యజమానులతో పొరుగు నియోజకవర్గ నేత పంచాయితీ

తిరుపతిలో ఆయన పెత్తనమేంటని కూటమి నేతల మండిపాటు

తిరుపతి, ఆంధ్రజ్యోతి

'వైసీపీ ప్రభుత్వంలో నెలనెలా ఒక్కో బారుకు రూ.1.5లక్షల మామూళ్లు ఇచ్చారు కదా.. ఇప్పుడు కూడా అలా ఇవ్వాల్సిందే. కాదు.. కూడదంటే రైడింగ్‌లతో ఇబ్బందులు తప్పవు' అంటూ పొరుగు నియోజకవర్గానికి చెందిన ఓ యువ నేత తిరుపతిలోని బార్ల యజమానులకు అల్టిమేటం జారీ చేశారు. వైసీపీ నేతలకిచ్చినట్టు రూ.20లక్షలు ఇస్తే.. దాన్ని ఎవరెవరికి వ్వాలో తాము చూసుకుంటామని కూడా చెప్పుకొచ్చినట్టు తెలిసింది.

వాళ్లకిచ్చారు కదా.. మాకూ ఇవ్వండి..!

ఎన్నికల ముందు టీడీపీలో చేరిన పొరుగు నియోజకవర్గానికి చెందిన యువనేత.. తిరుపతిలో ఓ బార్ నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, తిరుపతిలో ఆ పార్టీల నేతలు తలోదారిలో ఉండడంతో ఇక్కడ లిక్కర్ లీడర్‌గా అవతారమెత్తాడు. శుక్రవారం తన బారులోనే బార్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశాడు. 'సిండికేట్ వ్యాపారం చేసుకుందాం. ఏదైనా సమస్య వస్తే నేను చూసుకుంటా.. మీరేం భయపడవద్దు. అయితే గతంలో వైసీపీ నేతలకు ఏవిధంగా ఇస్తున్నారో, ఆ విధంగా మాకు కూడా ఇచ్చేయండి' అంటూ అక్రమ దందాకు తెరలేపినట్టు తెలియవచ్చింది. మరో బార్ యజమాని కుమారుడు ఇతనికి జతకట్టినట్టు తెలిసింది. 'జనసేన అభ్యర్థి గెలుపు కోసం రూ.2.5కోట్లు ఖర్చుపెట్టాను. 25వేల ఓట్లు నా వల్ల వైసీపీ నుంచి జనసేనకు టర్న్ చేశాను. పెద్దోళ్లతో మాట్లాడి అంతా సెట్ చేసే బాధ్యత మా ఇద్దరిదే' అని అతను చెప్పగానే ఒకరి ముఖాలు మరొకరు చూసుకోవాల్సి వచ్చింది.

పోలీసులతో బెదరగొట్టించి దారిలోకి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు ముగిసింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చే నెలవారీ మామూళ్లకు బ్రేక్ పడడంతో రూ.5లక్షల వరకు మిగిలిపోయాయని బార్ల యజమానులు సంతోషంలో ఉన్నారు. వారి ఆనందం మూడు నెలల ముచ్చటగానే మిగిలిపోయింది. గతంలో వైసీపీ నేతలకు మామూళ్లు ఇచ్చిన విషయాన్ని సదరు బార్ యజమాని ప్రజాప్రతినిధుల చెవిలో ఊదినట్టు తెలిసింది. 'అదేదో నువ్వే చూసుకో' అన్న సంకేతాలు రావడంతోనే సెటిల్మెంట్‌కు స్కెచ్ వేసినట్టు తెలుస్తోంది. రెండు వారాలుగా బార్ల యజమానులను పోలీసు కేసులు పెట్టి వేధించడం మొదలుపెట్టారు. ఉదయం 10 గంటలకు బారు ఓపెన్ చేస్తే రాత్రి 11 గంటలకు క్లోజ్ చేయాలి. సమయపాలనలో తేడావస్తే కేసులు, రూ.10వేల వరకు ఫైన్ వేస్తూ వచ్చారు. దారిలోకొచ్చిన బారు యజమానులు ఓ డీఎస్పీ దగ్గరకు వెళ్లి వేడుకున్నారు. 'గత ప్రభుత్వంలో వలే ఇప్పుడు కుదరదని, నిబంధనలు పాటించి వ్యాపారం చేసుకోవాల్సిందే' అని సదరు పోలీస్ అధికారి ఖరాకండిగా చెప్పేశారు. ఏదైనా మార్గం ఉంటే చెప్పాలని బార్ల నిర్వాహకులు పదేపదే అభ్యర్థించడంతో.. 'అదేదో పెద్దోళ్లతో మాట్లాడుకోండి' అని ఓ ఉచిత సలహా పడేసినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే బార్ల నిర్వాహకులు సమావేశమైనట్టు తెలిసింది. ఇక్కడ మరో ట్విస్ట్ ఏంటంటే? గడిచిన మూడు నెలల వాటా కూడా సదరు లిక్కర్ లీడర్ డిమాండ్ చేసినట్టు సమాచారం.

గతంలో ఇలా..

తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 13 బార్లవరకు ఉన్నాయి. స్టార్ హోటళ్లలో మరో ఐదు వరకు ఉన్నాయి. ఇందులో రెండు, మూడు బార్లు కూటమి నేతలవి కాగా.. తక్కినవన్నీ వైసీపీ నేతలు, ఆపార్టీ సానుభూతిపరులవే ఉన్నాయి. అయినా గతంలో ప్రతినెలా ఒక్కో బారు నుంచి రూ.1.5లక్షలను గౌరవంగా కవర్లోపెట్టి ముట్టచెప్పేవారని సమాచారం. వైసీపీ నగర పార్టీలో చిరకాలంగా కీలక పదవిలో ఉంటూ మౌనంగా కనిపించే ఓ నాయకుడికి ఈ కలెక్షన్ బాధ్యతలను స్థానిక నాయకత్వం అప్పగించారన్న ప్రచారముంది. లిక్కర్ వ్యాపారంలో రాటుదేలిన సదరు నేత నెలకు రూ.20లక్షల వరకు వసూలు చేసి ముఖ్యులకు అందజేస్తుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు అలాంటి బాధ్యత తాము తీసుకుంటున్నట్టు సమావేశం నిర్వహించిన బారు యజయాని చెబుతున్నట్టు తెలిసింది. అక్టోబరు ఒకటో తేదీనుంచి నూతన మద్యం పాలసీ అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో బార్ల ఆదాయం పడిపోనుందన్న ఆందోళన నిర్వాహకుల్లో లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో సెటిల్మెంట్ చేసుకోవాలా? వద్దా? అన్న గందరగోళంలో బార్ల యజమానులు పడ్డారు. ఇవన్నీ ఇలా ఉంటే.. పొరుగు నియోజకవర్గానికి చెందిన నాయకుడు ఇక్కడ పెత్తనం చేయడమేంటని కూటమి వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్టు సమాచారం.

చిచ్చురేపిన 'ర్యాష్ రైడింగ్'

● రెండు గ్రామాల మధ్య పరస్పర దాడులతో పరిస్థితి ఉద్రిక్తం

● అడ్డుకోబోయిన ఎస్‌ఐకీ స్వల్ప గాయం ● ఓ ఆర్టీసీ బస్సు అద్దం ధ్వంసం



పగిలిన ఆర్టీసీ బస్సు అద్దం

కేవీబీపురం, సెప్టెంబరు 8: పక్క గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు తమ గ్రామంలో ద్విచక్ర వాహనాలను ర్యాష్‌గా నడపడంపై స్థానిక మహిళలు ప్రశ్నించారు. దీనిపై మాటామాటా పెరిగి రెండు గ్రామాల మధ్య దాడులకు దారితీసి, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చివరకు పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. కేవీబీపురం మండలం పెరిందేశం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై రాగిగుంటలో అతివేగంగా చక్కర్లు కొట్టారు. భయపడ్డ స్థానిక మహిళలు అడ్డుకోవడంతో కొంతసేపు వాగ్వాదం జరిగింది. కాసేపటికి ఆ యువకులు అక్కడినుంచి వెళ్లి తమ గ్రామం సుమారు 30మందిని వెంటబెట్టుకొచ్చారు. దీంతో ఈ గొడవ కాస్తా రెండు గ్రామాల మధ్య పరస్పర దాడులకు దారితీసింది. ఆదివారం ఉదయం మళ్లీ పెరిందేశంవాసులు మళ్లీ రాగిగుంటకు చేరుకున్నారు. దుకాణాలను ధ్వంసం చేసి, పెరిందేశం గ్రామస్థులపై దాడికి దిగారు. దీంతో రెండు గ్రామాల వారు కొట్లాటకు తెగబడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గొడవను అడ్డుకోబోయిన పిచ్చాటూరు ఎస్‌ఐ వెంకటేష్‌పైనా మద్యం సీసాలు విసరడంతో ఎడమ కన్ను వద్ద స్వల్ప గాయమైంది. మరోవైపు రాగిగుంటవాసులు పిచ్చాటూరు రహదారిపై ఆందోళనకు దిగారు. ఏఎస్‌ఐ లోకనాథం అండతోనే పెరిందేశంవాసులు దాడి చేశారని ఆరోపించారు. ఈక్రమంలో గుర్తుతెలియని ఆందోళనకారులు అటుగా వచ్చిన శ్రీకాళహస్తి డిపోకి చెందిన బస్సు అద్దాన్నీ ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఏఎస్పీ రవి మనోహరాచారి, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ పలువురు సీఐలు, ఎస్‌ఐలతో ఘటనా స్థలానికి చేరుకుని, పరిస్థితిని అదుపు చేశారు. ఏఎస్పీ మాట్లాడుతూ.. ఈ గొడవతో సంబంధం ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇరువర్గాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అవసరమైతే రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, రెండు గ్రామాల్లోనూ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు.



నిరసన తెలుపుతున్న రాగిగుంట గ్రామస్థులు

మామ అల్లుళ్లపై వేటుకు సన్నద్ధం

కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐ, కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మామ అల్లుళ్లపై బదిలీ వేటుకు అధికారులు సన్నద్ధమైనట్లు సమాచారం. నిబంధనల ప్రకారం రక్తసంబంధీకులు ఒకే పోలీస్‌స్టేషన్‌లో పనిచేసేందుకు వీలుండదు. అయితే ఏఎస్‌ఐ.. రాజకీయ అండతో తన కుమార్తె భర్త అయిన కానిస్టేబుల్‌ను తాను పనిచేస్తున్న పోలీస్‌స్టేషన్‌కు డీవోగా తెచ్చుకున్నారు. ఈ ఏఎస్‌ఐ పనిచేసినా ప్రతిచోటా అనేక ఆరోపణలు ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. నెల కిందట కానిస్టేబుల్ అయిన అల్లుడు ఓ వ్యక్తి వద్ద అప్పు తీసుకుని చెల్లించకపోగా, తప్పుడు కేసు పెడతానంటూ బెదిరించడంపై బాధితుడు 100కు ఫోన్ చేశాడు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి కొంత నగదు వసూలు చేయించిన ఘటన కూడా ఆదివారం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. మరోవైపు ఈ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐని కూడా నియమించకుండా తానే చక్రం తిప్పుతున్నట్లు ఫిర్యాదు అందాయి. తాజాగా ఇదే ఏఎస్‌ఐ అండతోనే తమపై దాడి జరిగినట్లు రాగిగుంటవాసులు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మామాఅల్లుళ్లను తిరుపతి ఎస్పీ కార్యాలయానికి వెళ్లి రిపోర్టు చేయాల్సిందిగా మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.






యాగశాల పూజ నిర్వహిస్తున్న అర్చకులు - ధ్వజపటానికి హారతి ఇస్తున్న అర్చకుడు ధర్మేశ్వరగురుకుల్

కాణిపాకంలో వైభవంగా ధ్వజారోహణం

● వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 8: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం చేశారు. ఆలయ అనివేటి మండపంలోని ధ్వజ స్తంభాన్ని అభిషేకించారు. అనుజ్ఞ, గణపతిపూజ, మృత్ సంగ్రహణం, వాస్తు శాంతి, నవసంధి బలి, పుణ్యాహవచనం, మూషిక యాగం, ధ్వజపటపూజ, ధ్వజ స్తంభ అభిషేకం, వాస్తుబలి, మహా హారతినిచ్చి 9-10 గంటల మధ్య స్వాతి నక్షత్రయుక్త శుభ తులా లగ్నంలో వేదమంత్రాల నడుమ మూషిక ధ్వజ పటాన్ని నింగికి ఎగుర వేశారు. దీంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ బ్రహ్మోత్సవాలను కామికా ఆవాహన పద్ధతిలో నిర్వహిస్తారు. సాయంత్రం అర్చక, పండితులు యాగశాల ప్రవేశ పూజ నిర్వహించారు. యాగశాలలో ఈవో గురుప్రసాద్‌కు, అనంతరం ధ్వజస్తంభానికి, మూషికానికి అర్చకుడు ధర్మేశ్వరగురుకుల్ రక్షా బంధనాన్ని కట్టారు. దీనివల్ల బ్రహ్మోత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగవని ప్రజల నమ్మకం. రక్షా బంధనం కట్టున్న వ్యక్తి బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు ఊరి పొలిమేర దాటి వెళ్లకూడదని నియమం.



హంస వాహనంపై లంబోదరుడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వామికి హంస వాహన సేవ జరిగింది. ఉదయం మూల విరాట్‌కు ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, అగరంపల్లె, కారకాంపల్లె, వడ్రాంపల్లె, తిరువణంపల్లె గ్రామాలకు చెందిన శ్రీకరుణీక వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి ఉభయ వరస రావడంతో అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను హంస వాహనంపై ఉంచి పురవీధులలో ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మురళీ మోహన్, ఈవో గురుప్రసాద్, కాణిపాకం సర్పంచి శాంతిసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఉభయదారుల సంఘ అధ్యక్షుడు ఈశ్వర్‌బాబు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.




పురస్కారాలు అందుకుంటున్న టీచర్లు గీతారాణి, విజయలక్ష్మి, రెడ్డెప్పనాయుడు

ముగ్గురు టీచర్లకు గురుదేవోభవ పురస్కారాలు

భాకరాపేట/ఎర్రావారిపాలెం, సెప్టెంబరు 8 : చిన్నగొట్టిగల్లు మండలంలో ఇద్దరు ఉపాధ్యాయులకు, ఎర్రావారిపాలెం మండలంలో ఒకరికి గురుదేవోభవ జాతీయ పురస్కారాలు లభించాయి. చిన్నగొట్టిగల్లు మండలంలోని గాండ్లపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు గీతారాణి, కొమ్మిశెట్టిగారిపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు వనపర్తి విజయలక్ష్మి, ఎర్రావారిపాలెం మండలంలోని బోడేవాండ్లపల్లె ఉన్నత పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు రెడెప్పనాయుడికి ఆదివారం తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో జరిగిన కార్యక్రమంలో తుడా కార్యదర్శి వెంకటనారాయణచే పురస్కారాలను అందించారు. వే ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన గురుపూజోత్సవం సందర్భంగా ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. రెడెప్పనాయుడు తాను పని చేసిన పాఠశాలలో 100 శాతం తన సబ్జెక్టులో విద్యార్థుల పాస్ కావడం, 20 మంది పిల్లలు ఐఐటీలో సీట్లు సాధించేందుకు ప్రత్యేక తరగతులు సాయంత్రం వేళలో చెప్పడంతో తల్లిదండ్రులు, విద్యా కమిటీచే ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పైడి అంకయ్య, ఆర్‌జేపీయూపీ అధ్యక్షుడు టి.గోపాల్, బీజేపీ నాయకులు నవీన్‌కుమార్ రెడ్డి, ఆర్పీఎఫ్ సీఐ మధుసూదన్‌రావు, డాక్టర్ రెడ్డెప్ప, డాక్టర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆగివున్న లారీని ఢీకొన్న మరో లారీ

● డ్రైవర్ మృతి ● మరో డ్రైవర్‌కు తీవ్రగాయాలు



ఆగివున్న లారీని ఢీకొన్న మరోలారీ - (ఇన్‌సెట్‌లో)డ్రైవర్ నాగరాజు మృతదేహం

పాకాల, సెప్టెంబరు8: పాకాల మండలం నేంద్రగుంట సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపైన ఆదివారం ఉదయం ఆగివున్న లారీని వెనుకవచ్చిన మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. అదనపు డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. తమిళనాడు రాష్ట్రం సేలం నుంచి వెస్ట్‌బెంగాల్‌కు బ్రిక్స్ లోడుతో వెళ్తున్న లారీ నేంద్రగుంట సమీపంలో శనివారం అర్ధరాత్రి మరమ్మతులకు గురైంది. దీంతో లారీ డ్రైవర్ లారీని రోడ్డు పక్కగా ఆపివేశాడు. ఆదివారం ఉదయం చిత్తూరు వైపు నుంచి భద్రాచలానికి కట్టెల లోడుతో వేగంగా వెళ్తా రోడ్డు పక్కన ఆపివుంచిన లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా భద్రాది కొత్తగూడెం ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ నాగరాజు (24) మృతిచెందాడు. అదనపు డ్రైవర్ సాయిబాబు (45) క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని అతికష్టం మీద క్యాబిన్ తొలగించి సాయిబాబును బయటికి తీశారు. తీవ్రంగా గాయపడిన ఇతనిని చికిత్సకోసం అంబులెన్స్‌లో తిరుపతి రుయాసుపత్రికి తరలించారు. మృతిచెందిన నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మేన్ మృతి

తిరుచానూరు, సెప్టెంబరు 8: తిరుపతి-రేణిగుంట రోడ్డులో ఓ ప్రైవేటు ఆస్పత్రి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. తిరుచానూరు ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి కథనం మేరకు ... డక్కిలికి చెందిన మునెయ్య(49) తిరుపతిలోని ఓ కార్పొరేట్ కళాశాలలో వాచ్‌మేన్‌గా పనిచేస్తాడు. శనివారం సాయంత్రం రేణిగుంట రోడ్డు నుంచి తిరుచానూరుకు వెళ్లే క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. సమీపంలోని నారాయణాద్రి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రుయాకు తరలించగా చికిత్స పొందుతూ మునెయ్య మృతి చెందాడు. మొదట గుర్తుతెలియని వ్యక్తిగా భావించగా సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో తిరుపతి జిల్లా డక్కిలి మండల వాసిగా గుర్తించారు. సోమవారం శవపరీక్ష నిర్వహించి బంధువులకు అప్పగించనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేపు అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుచానరూరు, సెప్టెంబరు 8: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక పవిత్రోత్సవాలను పురస్కరించుకుని 10వ తేదీ ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఉదయం 7నుంచి 9.30గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. దీంతో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు. కాగా సెప్టెంబరు 16 నుంచి 18వ తేదీ నుంచి ఆలయంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా జరగనున్నాయి. సెప్టెంబరు 15న సాయంత్రం పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 16న పవిత్రప్రతిష్ఠ, 17న పవిత్ర సమర్పణ జరగనుంది. 18న మహాపూర్ణాహుతి నిర్వహించనున్నారు.

అమ్మవారి సేవలో ఏపీ లోకాయుక్త



తిరుచానూరు/తిరుమల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డి ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే తిరుచానూరులో కొలువైన శ్రీపద్మావతి అమ్మవారిని కూడా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారు కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామిని ఆదివారం లోకాయుక్తా జడ్జి లక్ష్మణరెడ్డి తన కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎం.కొంగరవారిపల్లెలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చంద్రగిరి, సెప్టెంబరు 8: చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లెలోని జడ్పీ హైస్కూల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆ పాఠశాలలో 1987-88, 1988-89వ సంవత్సరం పదో తరగతి చదివిన వారు పాఠశాలలో ఒకే వేదికపై కలిశారు. ఈ సందర్భంగా ఒకర్ని ఒకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

తోట పంటల సుస్థిరతకు పరిశోధనలు చేపట్టాలి


తిరుపతి రూరల్, సెప్టెంబరు 8: దేశంలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు, తోట పంటల రంగంలో సుస్థిరతని సాధించేందుకు పరిశోధనా ప్రాధాన్యతలు అత్యంత అవసరమని కొబ్బరి అభివృద్ధి బోర్డు మాజీ చైర్మన్ డాక్టర్ పి.రేతినం పేర్కొన్నారు. తిరుపతికి చెందిన భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధనా అకాడమీ(అగ్రశ్రీ) ఆధ్వర్యంలో ఆదివారం భారతదేశ ఆహారభద్రతకు 2047నాటికి చేపట్టాల్సిన ఆవిష్కరణలు-అనుసరించాల్సిన వ్యూహాలు అనే అంశంపై ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. సెంటర్ ప్లాంటేషన్ క్రాప్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మాజీ డైరెక్టర్ డాక్టర్ జార్జ్ థామస్, ఐసీఏఆర్ రిటైర్డ్ ఉద్యోగులసంఘ అధ్యక్షుడు ప్రొఫెసర్ వీవీపీఎస్ విద్యాసాగర్, ఆంగ్రూ రిటైర్డ్ డీన్ డాక్టర్ విజయ ఖాదర్, రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ చక్రపాణిరెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ బి. నరసింహారావు, డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ.. దేశంలో ఆహార ఉత్పత్తికోసం మరిన్ని వినూత్న వ్యూహాలు, సాంకేతికతని అభివృద్ధి చేయాలని సూచించారు. అగ్రశ్రీ డైరెక్టర్ డి.సుందరరామ్, తదితరులు పాల్గొన్నారు.


యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శిగా వెంకటాద్రి యాదవ్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 8: యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శిగా పూల వెంకటాద్రి యాదవ్ నియమితులయ్యారు. రేణిగుంట మండలం వెంకటాపురానికి చెందిన వెంకటాద్రి యాదవ్ ఎస్వీయూలో కామర్స్‌లో పీజీ పూర్తి చేశారు. ఈ క్రమంలో టీఎన్ఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా, తెలుగు యువత జిల్లా కార్యదర్శిగా పని చేశారు.

వైభవంగా వినాయక చవితి వేడుకలు




పాకాల సంతగేటులో కొలువైన వినాయకుడు - భాకరాపేటలో భారీ వినాయక విగ్రహం - గంగిరెడ్డిపల్లెలో మూషిక వినాయకుడు - బిజ్జేపల్లెలో కొలువైన గణనాథుడు - వెటర్నరీ వర్సిటీలో వినాయకుడి ప్రతిమకి వినతిపత్రం ఇస్తున్న బీసీ విద్యార్థిసంఘ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు

చంద్రగిరి, సెప్టెంబరు 8: చంద్రగిరి మండలంలో శనివారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అగరాలలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్, టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి(జేసీఆర్) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పులివర్తి నాని స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త ఏవీ రమణమూర్తి, టీడీపీ నాయకులు ముడిపల్లి సురేష్‌రెడ్డి, ఎల్లప్పరెడ్డి, గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, సింగు సుధా, ఎంపీటీసీ ఏసీ శేఖర్, లోకాద్రినాయుడు, విశ్వనాథం, వెంకటముని, శివారెడ్డి, ఉస్మాన్, చంద్రబాబు, గోవర్థన్, తదితరులు పాల్గొన్నారు.

పాకాల : పాకాల సంతగేటువద్ద, న్యూకాలనీలో ఏర్పాటు చేసిన వినాయక భారీ ప్రతిమలు ఆకట్టుకున్నాయి. ఆయా మండపాలవద్ద ప్రత్యేక విద్యుద్దీపాలంకరణలు చేశారు. న్యూకాలనీలో ఏర్పాటు చేసిన ప్రతిమను 15వ తేది, సంతగేటులో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను 16వ తేది నిమజ్జనం చేయనున్నట్లు నిరాహకులు తెలిపారు.

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ శనివారం వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

రామచంద్రాపురం : మండలంలోని గంగిరెడ్డిపల్లె, ఆర్‌సీపురం, రామాపురం, కమ్మకండ్రిగ, రాయలచెరువుపేట గ్రామాల్లోని గణపతి ఆలయాల్లో శనివారం వినాయక చవితి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లో భారీ మట్టి వినాయకుని తయారుచేసి పూజలు నిర్వహించారు. మేళతాళాల నడుమ గ్రామాల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా యువత వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



వినాయకస్వామికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ఎర్రావారిపాలెం : మండలంలో వాడవాడలా పచ్చని మండపాల్లో గణనాథుడు కొలువై హారతులందుకుంటున్నాడు. భజనలు, కోలాటాలు, కీర్తనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నగరాల్లో కంటే పల్లెల్లో వెదురుతో, టెంకాయ మట్టలతో వేసిన పచ్చని మండపాలు మరింత ఆధ్యాత్మిక శోభను చేకూర్చింది.

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలంలోని గ్రామాల్లో వినాయక చవితి పర్వదినాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. చలువపందిళ్లలో వినాయకుడి ప్రతిమలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్టికొట్టడం, అన్నదానం వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

● తుమ్మలగుంటలో ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఆలయ దర్మకర్త దొడ్ల కరుణాకర్ రెడ్డి నేతృత్వంలో భారీ వినాయకుడిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

● తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలో భారీ వినాయకుడిని కొలువదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ జిల్లాప్రధాన కార్యదర్శి యు.మునిశేఖర్‌రాయల్, యు.మౌనిక, నాయకులు చిన్ని, రవి,చంద్రశేఖర్, నాగరాజు, బాబురాయల్, ఓసీ రాయల్, శ్రీనురాయల్, మునికృష్ణయ్య, ఢిల్లీ, రామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు. ● ఎస్వీ వెటర్నరీవర్సిటీ ప్రధానగేటు వద్ద వినాయకుడిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఏపీ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ యు.నాగేశ్వరరావు నేతృత్వంలో ఆదివారం పలువురు విద్యార్థులు కలసి ..రాష్ట్రంలో బీసీ కులగణనని చేపట్టాలని వినాయకుడి ప్రతిమకి వినతిపత్రం సమర్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీ హాస్టల్స్‌కి శాశ్వత భవనాలు నిర్మించాలని, మెస్, కాస్మోటిక్స్ చార్జీల పెంచాలని కోరారు. ఏజరా, ఆదర్శ్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తితోపాటు పర్యావరణ హితం కోరి...

● మట్టి వినాయక ప్రతిమలను తయారు చేస్తున్న విశ్రాంత ఎస్‌ఐ



రామచంద్రాపురం, సెప్టెంబరు 8: తమ తాత, ముత్తాతల నుంచి వచ్చిన కులవృత్తిని వదలేక... కాలుష్యం వెదజల్లుతున్న రంగు బొమ్మల తయారీ వద్దంటూ ఓ విశ్రాంత ఎస్‌ఐ నడిరోడ్డుపై మట్టి వినాయక ప్రతిమలను తయారుచేసి అమ్మించారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం మండలంలోని కమ్మపల్లెకు చెందిన త్యాగరాజులుశెట్టి తిరుపతిలో ఎస్‌ఐగా పదేళ్ల పాటు పనిచేశారు. తండ్రి కుండలను తయారు చేసేవారు. చిన్నప్పటి నుంచి తండ్రికి చేదోడు వాదోడుగా త్యాగరాజుశెట్టి ఉండేవారు. ఉన్నత చదువులు చదివి ఎస్‌ఐగా తిరుపతిలో పదేళ్లకు పైగా పనిచేశారు. ప్రతి యేడాది దీపావళికి ప్రమిదలు, మట్టి వినాయక ప్రతిమలు తయారుచేసేవారు. ఈ క్రమంలో తన కులవృత్తిని మరచిపోకుండా పర్యావరణాన్ని కాపాడటానికి వినాయక చవితి మూడురోజుల ముందు నుంచే తిరుపతి బైరాగిపట్టెడ వీధిలో తన కుటుంబ సభ్యులతో కలిసి మట్టి బొమ్మలను తయారుచేసి తక్కువ ధరకే విక్రయించారు. దీంతో త్యాగరాజశెట్టిని బాగా తెలిసిన వారు శభాష్ అంటున్నారు.

గంగుడుపల్లెలో జల్లికట్టు



చంద్రగిరి, సెప్టెంబరు 8: చంద్రగిరి మండలం గంగుడుపల్లెలో పశువుల పండుగ(జల్లికట్టు) అట్టహాసంగా నిర్వహించారు. ఏటా సంక్రాంతికి పశువుల పండుగ నిర్వహించేవారు. అనివార్య కారణాలతో అప్పట్లో జరుపుకోలేదు. దీంతో ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో గ్రామ నడివీధిలో కోడెగిత్తలను వదిలారు. యువకులు వాటిని నిలువరించేందుకు పోటీలు పడ్డారు. పలువురికి తీవ్ర, స్వల్ప గాయాలయ్యాయి. పండగను తిలకించడానికి వచ్చినవారికి గ్రామస్తులు భోజనం, తాగునీటి సౌకర్యం కల్పించారు.

కాలూరులో ప్రభుత్వ భూమి చదును

తిరుపతి రూరల్, సెప్టెంబరు8: తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీ కాలూరులో సర్వేనెంబరు 69లోని 2.6ఎకరాల ప్రభుత్వభూమి(గుడికుంట పొరంబోకు)ని ఆదివారం ఇదే గ్రామానికి చెందిన రేణుకా ఎలమ్మ ఆలయ సంక్షేమ సంఘ కమిటీ సభ్యుల నేతృత్వంలో ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్నారు. ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగిస్తున్నారు. తిరుపతి-చంద్రగిరి జాతీయ రహదారికి సమీపంలో గుడికి సంబంధించిన విలువైన భూమి కావడంతో ఆక్రమణలకు గురికాకుండా ఉండేందుకు దీన్ని చదును చేస్తున్నామని కమిటీ సభ్యులు అంటుండగా.. మండల, గ్రామ రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా ఎలా చదును చేస్తారని మరికొందరు గ్రామస్తులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. దేవుడి పేరుతో ఈ స్థలాన్ని తమ ఆదీనంలో ఉంచుకునేందుకు చూస్తున్నారని అంటున్నారు. ఇప్పటికే కొంతస్థలం ఆక్రమణలకు గురైందని, మిగిలిఉన్న భూమినైనా కాపాడి గ్రామ అవసరాల కోసం వినియోగించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై వీఆర్వోని వివరణ కోరగా.. కమిటీ ప్రతినిధులు తమని సంప్రదించగా ప్యారడంగల్‌లో ప్రభుత్వభూమిగా(గుడికుంట)నమోదై ఉందని, మండల సర్వేయర్ ద్వారా సర్వేచేసి రక్షణ చర్యలు చేపడుతామని చెప్పామని తెలిపారు. అనుమతిలేకుండా ఈ భూమిలోకి ఎవరూ ప్రవేశించరాదని తెలిపారు.



ఎక్స్‌కవేటర్‌తో ముళ్లపొదలు, మొక్కలను తొలగిస్తున్న దృశ్యం

వేర్వేరు ఘటనల్లో 40 ఎర్రచందనం దుంగల స్వాధీనం

● ముగ్గురి అరెస్టు



కరకంబాడి వద్ద ఎర్రచందనంతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది

మంగళం, సెప్టెంబరు 8: తిరుపతి, కడప జిల్లాల్లో శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి 40 ఎర్రచందనం దుంగలు, ఒక కారు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌ఛార్జి, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్‌ఐ లింగాధర్ శనివారం తెల్లవారుజామున కరకంబాడి అటవీప్రాంతంలోని తిరుపతి-కడప జాతీయ రహదారిలో ఆంజనేయపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు కారులో నుంచి దిగి పారిపోయారు. మరో ఇద్దరిని టాస్క్‌ఫోర్సు బృందం పట్టుకోగలిగింది. పట్టుబడ్డ ఇద్దరు తమిళనాడులోని సేలం జిల్లాకు చెందినవారుగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి కారులోని 12దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కారును సీజ్ చేశారు. మరో ఘటనలో ఆర్ఎస్‌ఐ నరేష్ బృందం కడపజిల్లా చక్రాయపేట వద్ద కూంబింగ్ చేస్తుండగా మాలబీళ్ల వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుంటూ వస్తుండగా టాస్క్‌ఫోర్సు పోలీసులు చుట్టుముట్టారు. పోలీసులను గమనించిన వారు పారిపోగా ఒక వ్యక్తిని పట్టుకోగలిగారు. అతను కడపజిల్లా చక్రాయపేట మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఒకమోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారికోసం గాలిస్తున్నారు. ఈ రెండింటిపై తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌లో సీఎస్ సురేష్‌కుమార్, ఎస్‌ఐ రఫీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూ ప్రతినిధుల అమెరికా పయనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 8: ఎస్వీయూనివర్సిటీకి చెందిన ఆరుగురు ప్రొఫెసర్ల బృందం అమెరికాకు పయనమైంది. ఈ బృందం 20 రోజుల పాటు ఆ దేశంలో పర్యటించనుంది. ఈ బృందంలో ఎస్వీయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ విజయభాస్కరరావు, వైరాలజీ ప్రొఫెసర్ హేమ, ఇంగ్లీష ప్రొఫెసర్ సుమకిరణ్, రుసా ప్రతినిధి వంశీకృష్ణ, ఇంజనీరింగ్ ప్రొఫెసర్ రమాశ్రీ, తదితరులు ఉన్నారు. ఎస్వీయూనివర్సిటీ, అమెరికాలోని పార్డ్యూ యూనివర్సిటీల మధ్య ఎంటర్‌ప్రైనర్‌షిప్ (బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో పరస్పర సహకారం) కల్పించేందుకు ఈనెల ఏడో తేదీన తిరుపతి నుంచి బయల్దేరి వెళ్లినట్లు సమాచారం. చాలాకాలం కిందటే ఈ పర్యటనకు వెళ్లాల్సి ఉన్నా అనేక కారణాలతో ఆలస్యమైంది. ఈ పర్యటన తర్వాత, అమెరికన్ యూనివర్సిటీ ప్రతినిధులు కూడా త్వరలో ఎస్వీయూనివర్సిటీని సందర్శించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

'హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ గుర్తింపు ఉన్న సంస్థ'

తిరుపతి(విద్య), సెప్టెంబరు 8: హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఆంధ్రప్రదేశ్‌తోసహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో గుర్తింపు ఉందని ఏపీ కమిషనర్ తుంగ శ్రీకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తమకు రాష్ట్రంలో అనుమతి లేదని, నకిలీ అసోసియేషన్లు విద్యాసంస్థల్లో కార్యక్రమాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇటీవల డీఈవో ప్రకటించడాన్ని ఖండించారు. దీనిపై కేంద్ర మానవ వనరుల క్రీడా మంత్రిత్వశాఖ సెక్రటరీ మీటా రాజీవ్‌లోచన్, కేంద్ర కేబినెట్ సెక్రటరీకి ఫిర్యాదు చేశామని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు వెల్లడించారు.

పండుగ రోజు సెల్‌ఫోన్ల చోరీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8: తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి పోలీసు స్టేషన్ల పరిధిలో వినాయక చవితి రోజున సెల్‌ఫోన్ దొంగలు హల్‌చల్ చేశారు. ఒక్కరోజే దాదాపు 20 సెల్ ఫోన్లు కొట్టేశారు. బాధితుల కథనం మేరకు... తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటకు చెందిన ఒక వ్యక్తి ఉప్పరపల్లెకి తన పనుల నిమిత్తం వెళ్లాడు. బ్యాంకు సమీపంలో ఓ యువకుడు బైక్ నుంచి కిందపడ్డాడు. అతడిని పైకి లేపేందుకు వెళ్లగా జేబులోని రూ.1.30 లక్షల సెల్‌ఫోన్ కొట్టేశారు. విద్యానగర్ ఇండియన్ పెట్రోలు బంకు ఎదురుగా రహదారి పక్కన హరిపురంకాలనీ ద్వారకానగర్‌కు చెందిన వ్యక్తి విగ్రహం కొనుగోలు చేస్తుండగా అతడి వెనుకనే ముఖానికి మాస్క్ ధరించిన కేటుగాడు మొబైల్ ఫోన్ కొట్టేశాడు. ఇలాగే పలువురు తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. కాగా, ఏడాదిగా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేదని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 8: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కందారపు మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ పరిస్థితి దారుణంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు తిరుమలనంబి అవతార మహోత్సవం

తిరుమల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవాచార్యులు తిరుమలనంబి 1051వ అవతార మహోత్సవం సోమవారం తిరుమలలోని దక్షిణమాడవీధిలో ఉన్న తిరుమలనంబి ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నారు. తిరుమలనంబి ఆలయంలో ఉదయం 9.30 నుంచి 16మంది ప్రముఖ పండితులు తిరుమలనంబి జీవిత చరిత్రపై ఉపన్యసించనున్నారు. శ్రీవారి భక్తాగ్రేసరుల్లో ఒక్కరైన తిరుమలనంబి శ్రీవారికి తీర్థకైంకర్యం ప్రారంభించిన విషయం తెలిసిందే.

వాట్సప్ గ్రూప్ అడ్మిన్‌పై పోలీసులకు ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీనాయకులు

రామచంద్రాపురం, సెప్టెంబరు 8: ఓ దినపత్రికలో ఎమ్మెల్యే నానిపై వచ్చిన వార్తను పలువురికి ఫార్వడ్ చేసిన వాట్సప్ గ్రూప్ అడ్మిన్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఆర్‌సీ పురం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండల పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో ఎమ్మెల్యే పులివర్తి నాని తన అనుచరుల ద్వారా ముడుపులు తీసుకున్నారని ఓ దినపత్రిక వార్త ప్రచురించిందన్నారు. దీనిని చంద్రగిరి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ సెంథిల్‌కుమార్‌తోపాటు ఆర్‌సీపురానికి చెందిన మరో ఇద్దరు పలువురికి వాట్సప్ మెసేజ్ పెట్టారన్నారు. నానిపై తప్పుడు సమాచారాన్ని పెట్టినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు జనార్థన్ చౌదరి, కోరా హరిప్రసాద్, మునిరామిరెడ్డి, ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

రుయాలో డాక్టర్లపై దాడి కేసులో ఏడుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8: రుయాస్పత్రిలోని డాక్టర్లపై దాడి చేసిన కేసులో తిరుపతికి చెందిన ఏడుగురిని వెస్ట్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈనెల 6వ తేదీ అర్ధరాత్రి 11.30 గంటలకు రుయా ఆస్పత్రి క్యాజువాలిటీ ముందు పీజీ డాక్టర్లపై విచక్షణా రహితంగా కొందరు దాడిచేశారు. ఈ కేసులో చింతలచేనుకు చెందిన ఏసీ మెకానిక్ షేక్షావలి, షేక్ చాంద్‌బాషా, మునికృష్ణ వసంత్, జె.కృష్ణబాబు, ఎస్.మణి, పి.శివకుమార్, బి.సాయికుమార్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాలతో డీఎస్పీ వెంకటనారాయణ, వెస్ట్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి చింతలచేను రైల్వే ట్రాక్ వద్ద అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటనారాయణ మాట్లాడుతూ.. అనవసరంగా ఆస్పత్రుల్లో డాక్టర్లపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ రామకృష్ణ, సిబ్బందిని అభినందించారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా బాబు

● రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాంభూపాల్‌రెడ్డి, నగరాధ్యక్షుడిగా చిట్టిబాబు



బాలగురువం బాబు - రాంభూపాల్‌రెడ్డి - చిట్టిబాబు

తిరుపతి(కపిలతీర్థం/జీవకోన), సెప్టెంబరు 8: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన బాలగురువం బాబును నియమించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరునగరికి చెందిన దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డిని, నగరాధ్యక్షుడిగా గౌడపేరు చిట్టిబాబులను శనివారం అధిష్ఠానం నియమించింది. కాగా, ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో బాబు మాట్లాడుతూ.. తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఈస్ట్ ఎస్‌ఐగా నాగేంద్రబాబు బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8: తిరుపతి ఈస్ట్ సీఐగా నాగేంద్రబాబు ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎంఆర్‌పల్లి స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఏఎస్‌ఐలు, సిబ్బంది స్వాగతం పలికారు.

విజయవాడలో కార్పొరేషన్ సిబ్బంది సహాయక చర్యలు



తిరుపతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో తిరుపతి నగరపాలక సంస్థ అధికార యంత్రాంగం, పారిశుధ్య విభాగం సిబ్బంది యుద్ధప్రాతిపదికన సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. కమిషనర్ నారపరెడ్డి మౌర్య నేతృత్వంలో 80 మంది కార్మికులు, ఇంజనీరింగ్, హెల్త్ అధికారులు నాలుగు రోజుల క్రితం విజయవాడకు వెళ్లిన విషయం తెలిసిందే. తిరుపతి నగరపాలక సంస్థ పనితీరుపై అక్కడి స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, ఎంహెచ్‌వో యువ అన్వేష్ రెడ్డి, డీఈలు సంజయ్‌కుమార్, మహేష్, రాజు, నరేంద్ర, రవీంద్రరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

వివిధ రూప.. వినాయక



కోలావీధిలో

తిరుపతిలో శనివారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో వినాయక బొమ్మలను ఉంచి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నగరంతో పాటు పరిసరాల్లోని ప్రధాన కూడళ్లలో వివిధ రూపాల్లో భారీ వినాయక విగ్రహాలను పెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రతిమలకు పూజలు చేసి, ప్రసాదాలు పంచిపెట్టారు. చాలా చోట్ల మూడో రోజైన సోమవారం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు.

- తిరుపతి కల్చరల్


తీర్థకట్ట వీధిలో





కొత్తవీధిలో ఉయ్యాల్లో ఊగుతున్న వినాయకుడు - నెహ్రూనగర్‌లో అయోధ్య ఆలయం - మంచినీళ్లు గుంట రోడ్డులో- పళని థియేటర్ రోడ్డులో


బొమ్మగుంట యూత్ ఆధ్వర్యంలో...


ఎంఆర్‌పల్లి రోడ్డులో


జ్యోతి థియేటర్ రోడ్డులో


దొడ్డాపురంవీధిలో యాలకులతో





యాదవవీధిలో రాగి కలశాలతో - ఎస్‌టీవీ నగర్ రోడ్డులో అయోధ్య రాముని వినాయకుడు - కోటికమ్మల వీధిలో శివపుత్ర వినాయకుడు - డి.ఆర్.మహల్ రోడ్డులో


పల్లెవీధిలో...


నిమ్మకాయలవీధిలో కాళికామాత రూపంలో


చింతకాయల వీధిలో


కేజీ లేఅవుట్‌లో గవ్వలతో


ఎస్‌టీవీ నగర్ రోడ్డులో సరస్వతి వినాయకుడు


కర్ణాలవీధిలో


ఆటోనగర్ రాజీవ్‌గాంధీ కాలనీ యూత్ ఆధ్వర్యంలో కాణిపాకం వినాయకుడు


తాతయ్యగుంట గంగమ్మరోడ్డులో హనుమంత వినాయకుడు

వినాయకసాగర్ వద్ద సందడి




తిరుపతి (జీవకోన/నేరవిభాగం), సెప్టెంబరు 8: కరకంబాడి రోడ్డులోని వినాయకసాగర్‌లో శనివారం సాయంత్రం నుంచే సందడి వాతావరణం నెలకొంది. వినాయక చవితి పండుగలో భాగంగా ఇళ్లలో ప్రతిష్ఠించిన గణేశుడి ప్రతిమలను సాగర్‌కు తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, డీఈ విజయకుమార్‌రెడ్డి, నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్‌సీ మునికృష్ణ, భాను ప్రకాష్‌రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఊకా విజయకుమార్, కరాటే శ్రీనివాస, చెన్నం నవీన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ● సాగర్ వద్ద ఉన్న శ్రీసంకల్ప వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో జరిగిన చవితి వేడుకల్లో ఛైర్మన్ చెంగారెడ్డి, అర్చకులు, సభ్యులు పాల్గొన్నారు.

నిమజ్జనం కోసం ఏర్పాట్లు పూర్తి

వినాయకసాగర్‌లో సోమవారం గణేశుడి ప్రతిమల నిమజ్జనం కోసం ఏర్పాట్లను పూర్తి చేశారు. నీటికుంటను పూర్తిస్థాయిలో నింపి, చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేశారు. భారీ విగ్రహాలను సైతం నిమజ్జనం చేసేందుకు ముందస్తుగా క్రేన్లను సిద్ధంగా ఉంచారు.


భారీ విగ్రహాల కోసం సిద్ధంగా ఉంచిన క్రేన్

పటిష్ఠ భద్రత, భారీ వాహనాలకు అనుమతి లేదు: ఎస్పీ



వినాయకసాగర్ వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం వివిధ శాఖ అధికారులు, నిమజ్జన కమిటీ సభ్యులతో కలిసి సాగర్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాగర్ వద్దకు భారీ వాహనాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ముందస్తుగా పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి, సూచికబోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. తిరుమలకు శ్రీవారి దర్శనం కోసం విచ్చేసే భక్తులకు, నగర ప్రజలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా సహకరించాలని కోరారు. ఏఎస్పీ వెంకట్రావు, అడ్మిన్, డీఎస్పీలు వెంకటనారాయణ, రామకృష్ణ ఆచారి, సీఐలు రామ్‌కిషోర్, మున్సిపల్ అధికారుల, నిమజ్జన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూట్‌మ్యాప్ సిద్ధం

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించడానికి కమిటీతో కలసి జిల్లా పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాలతో శాంతి భద్రతల అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ వెంకటనారాయణ, సీఐలు మహేశ్వరరెడ్డి, రామకృష్ణ, రామయ్య, రాంకిషోర్‌లు కలసి ప్రత్యేకంగా రూటు మ్యాప్ సిద్ధం చేశారు. ● కోనేటికట్ట, నెహ్రూవీధి, రైల్వే స్టేషన్, తుడా రోడ్డు మీదుగా కొర్లగుంటకు చేరుకుని లీలామహల్ మీదుగా వినాయకసాగర్‌కు వెళ్లాలి. ● బాలాజీ కాలనీ, పోలీసు క్వార్టర్స్, ఇందిరాగనర్, టౌన్‌క్లబ్, గాంధీరోడ్డు, నాలుగు కాళ్ల మండపం, మున్సిపల్ ఆఫీసు, దేవేందర్ థియేటర్ మీదుగా లీలామహల్ నుంచి వినాయకసాగర్‌కు చేరుకోవాలి. ● ఎల్ఐసీ మార్గం నుంచి జ్యోతి థియేటర్, రిజర్వాయర్ రోడ్డు, ఆర్‌కే డీలక్స్, భవానీనగర్, రెడ్డి రెడ్డి కాలనీ, పాత మున్సిపల్ ఆఫీసు, దేవేందర్ థియేటర్, లీలామహల్ అక్కడినుంచి వినాయకసాగర్ వద్దకు రావాలి. ● ఇస్కాన్ టెంపుల్ నుంచి అన్నారావు సర్కిల్, మున్సిపల్ పార్కు, లీలామహల్ మీదుగా, పద్మావతి నగర్, గాయత్రి నగర్, మునిరెడ్డి కాలనీ, బైరాగిపట్టెడ, లక్ష్మీపురం సర్కిల్, రామానుజ సర్కిల్, శ్రీనివాసం, లీలామహల్ మీదుగా వినాయకసాగర్‌కు వెళ్లాలి.

విజయగణపతి ఆలయంలో...

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 8: నగర పరిధిలోని ఆటోనగర్ రాజీవ్ గాంధీ కాలనీలోని విజయగణపతి ఆలయంలో వినాయక చవితి వేడుకలు శనివారం ఆలయ వ్యవస్థాపకులు అజయ్‌ప్రతాప్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి ప్రజల కోరిక మేరకు 2014లో సొంత నిధులతో విజయగణపతి ఆలయం నిర్మాణం చేశామని తెలిపారు. పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం, వైస్ ప్రెసిడెంట్ రామయ్య, చక్రపాణి, వెంకటసుబ్బయ్య, వెంకటేష్, శేఖర్, శరవణ, రాము, కాలనీ వాసులు అజయ్‌ప్రతాప్‌ను సత్కరించారు. అనంతరం 1500మందికి అన్నదానం చేశారు.


విజయగణపతికి పూజలు చేస్తున్న అజయ్‌ప్రతాప్

బాణసంచా కాల్చొద్దు.. మత్తు పదార్థాలు తీసుకోవద్దు

తిరుపతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమవారం వినాయక ప్రతిమల నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులో బాణసంచా కాల్చొద్దని, మత్తు పదార్థాలు తీసుకుని పాల్గొనవద్దని వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు. నిమజ్జనం సందర్భంగా అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పిస్తూ ఆదివారం కమిటీ ప్రతినిధులు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. గందరగోళమైన సినిమా పాటలు పెట్టి ఉత్సవ పవిత్రతను దెబ్బతీయొద్దని విజ్ఞప్తి చేశారు. నగరం చుట్టుపక్కల ఉన్నవాళ్లు చెన్నాగుంట, గొల్లపల్లె, దామినేడు చెరువులకు చేరుకుని నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి చేసుకోవాలని కోరారు.


ఉత్సవ కమిటీ బైక్ ర్యాలీ

ఘనంగా వినాయక చవితి సంబరాలు



తిరుపతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు ఆర్సీ మునికృష్ణ, పొన్నాల చంద్ర, ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్యలు పాల్గొని గణనాథుడికి పూజలు నిర్వహించారు. విజయవాడ వరదల్లో పాల్గొనేందుకు తిరుపతి కార్పొరేషన్ నుంచి వెళ్లిన అధికార యంత్రాంగం, సిబ్బందిని ఈసందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, పులుగోరు మురళీకృష్ణా రెడ్డి, ఊకా విజయకుమార్, జనసేన నేత కిరణ్‌రాయల్, కార్పొరేషన్ ఎస్ఈ మోహన్, డీఈ విజయకుమార్ రెడ్డి, డీసీపీ శ్రీనివాసుల రెడ్డి, ఆర్వో సేతుమాధవ్, మేనేజర్ చిట్టిబాబు, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర పాల్గొన్నారు.

అన్నదానం



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం 35వ డివిజన్లోని టి.నగర్‌లో టీడీపీ నేతలు రవిశంకర్ యాదవ్ (సుబ్బు), ఆవుల శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్‌లు ముఖ్యఅతిధులు పాల్గొని అన్నప్రసాద వితరణ చేశారు. అదేవిధంగా శనివారం జరిగిన చవితి వేడుకల్లో తుడా మాజీ ఛైర్మన్లు ఎన్వీ ప్రసాద్, నరసింహ యాదవ్, టీడీపీ రాష్ట్ర నాయకుడు దంపూరి భాస్కర్ యాదవ్‌లు గణేష్ పూజలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బుజ్జి, శేష, సాయి పాల్గొన్నారు.

మిట్టవీధిలో అన్నదానం

తిరుపతి (జీవకోన): తిరుపతి, మిట్టవీధిలోని శ్రీవేంకటేశ్వర లక్ష్మీగణపతి యూత్ ఆధ్వర్యంలో ఆదివారం గణపతి మండపం వద్ద అన్నదానం జరిగింది. సుమారు ఐదు వందల మందికి అన్నదానం చేశారు. ఇందులో బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి, నవీన్‌కుమార్ రెడ్డి, అజయ్‌కుమార్, కిషోర్ సింగ్, జనసేన తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు మధుబాబు, ఏబీవీపీ హరి, వెస్ట్ సీఐ రామకృష్ణ, మిట్టవీధి యూత్ కోల హరి, కుమార్ రాయల్, చరణ్, హేమంత్, వెంకటేష్, చింటూ, హర్ష ధీరజ్, సాయి, భాస్కర పాల్గొన్నారు.


నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న మిట్టవీధి యూత్

ఎస్పీ ఆఫీసులో

తిరుపతి(నేరవిభాగం): ఎస్పీ కార్యాలయంలో శనివారం ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో వినాయక చవితి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న ఎస్పీ

టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో



మంగళం: టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో శనివారం వినాయకచవితి పూజల్లో కేసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐ సురేష్‌కుమార్, ఎఫ్ఆరెవ్వోలు మురళి, ప్రేమ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

కపిలేశ్వర స్వామి ఆలయంలో

తిరుపతి(కల్చరల్): కపిలేశ్వర స్వామి ఆలయంలో కొలువైన వినాయకుడికి టీటీడీ ఆధ్వర్యంలో శనివారం చవితి వేడుకలు నిర్వహించారు. సాయంత్రం వినాయక స్వామిని మూషిక వాహనంపై ఊరేగించారు. ఆలయడిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, సూపరింటెండెంట్ శ్రీకృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు. ఘాట్ రోడ్డు లోని వినాయక ఆలయంలో కూడా మూలవర్లకు అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. ● ఎర్రమిట్టలో ఆదివారం సాయంత్రం జరిగిన ఉట్టి కొట్టే వేడుకలో రామ్‌కుమార్, యశ్వంత్, వెంకటేష్, కీర్తన, హరిప్రియ, హేమ, డిపి ఆనంద్, బీజేపీ నేత గుండాల గోపినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీ యూనివర్సిటీలో...



తిరుపతి (విశ్వవిద్యాలయాలు): ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీలో నిర్వహించిన వినాయక ఉత్సవంలో భాగంగా చేపట్టిన ప్రత్యేక పూజల్లో రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. విద్యార్థులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పూజారి రాఘవేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేంద్ర, నాయకులు ఈశ్వర్, దివాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి అర్బన్: నగరంలో జరిగిన వినాయక చవితి వేడుకల్లో పలు చోట్ల జనసేన తిరుపతి నియోజకవర్గం ఇంచార్జ్ కిరణ్‌రాయల్, పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. మంగళం పరిధిలో టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరి శ్రీనివాసులయాదవ్ పాల్గొని పూజలు చేపట్టారు.

అలరించిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, సెప్టెంబరు 8: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం తిరుపతికి చెందిన నాట్యరవళి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులు కల్యాణి, రితికశ్రీ, మౌనిష, ధాత్రి, మిధునశ్రీ, బేబీ నిష, ప్రజ్ఞ తదితరులు గజాననః, ముద్దుగారే యశోద, భో శంభో, బ్రహ్మ మొక్కటే, వచ్చెను అలమేలు మంగ వంటి కీర్తనలకు నృత్యం చేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి హా దబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647
AJA- 198066

TOURS & TRAVELS
శ్రీరామమూర్తి యాత్ర స్పెషల్ : తిరుపతి-రామేశ్వరం, కన్యాకుమారి, పళని, శ్రీరంగం, జంబుకేశ్వరం, తిరువన్నామలై. మొత్తం 11 ప్రదేశాలు. 4-10-2024వ తేది, 5 రోజులు, 5500. సంప్ర. : 9441891921
AJT - 4256

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సబ్‌కలెక్టర్‌గా రాఘవేంద్రమీనా బాధ్యతల స్వీకరణ



గూడూరు, సెప్టెంబరు 8: గూడూరు సబ్‌కలెక్టర్‌గా రాఘవేంద్ర మీనా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్‌ను బదిలీ చేయడంతో ఆయన స్థానంలో రాఘవేంద్రమీనా బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా ట్రైనీ కలెక్టర్‌గా విధులు నిర్వహించి గూడూరు సబ్‌కలెక్టర్‌గా మొదటి పోస్టింగ్‌ను స్వీకరించారు.

దాతృత్వాన్ని చాటుకోవడం అభినందనీయం



ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న బలిజ సంఘం నాయకులు

గూడూరు, సెప్టెంబరు 8: వరద బాధితులను ఆదుకునేందుకు పట్టణంలోని పలువురు ముందుకు వచ్చి సీఎం సహాయనిధికి నిధులు అందజేస్తూ దాతృత్వాన్ని చాటుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక గ్రూప్ థియేటర్‌లో బలిజ అభ్యుదయ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో చదలవాడ హరిప్రసాద్ సహకారంతో సీఎం సహాయనిధికి రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. వరద బాధితులకు తన సొంతనిధులు రూ.5లక్షల విలువైన దుప్పట్లను సోమవారం సీఎం చంద్రబాబు సమక్షంలో విజయవాడలో అందజేస్తానన్నారు. కార్యక్రమంలో చదలవాడ హరిప్రసాద్, చదలవాడ విజయభాస్కర్, ఎస్.కిరణ్‌కుమార్, ఎం.వి.రమణయ్య, రామ్మూర్తి, లక్ష్మీనారాయణ, పి.శ్రీహరి, ఉదయ్‌భాస్కర్, శ్రీనివాసులు, చంద్రనీల్, జి.విజయ, వెంకట్రావు, ఎం.నాగేశ్వరరావు, ప్రకాష్‌రావు, మునిగిరీష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చిల్లకూరు మండలం నెలబల్లిరెట్టపల్లికి చెందిన టీడీపీ నాయకుడు ఎం.సూర్యనారాయణ సీఎం సహాయనిధికి రూ. 18వేలు చెక్కును ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు అందజేశారు. వరదబాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ. 1.10లక్షల చెక్కును 3, 4వ వార్డులకు చెందిన టీడీపీ నాయకులు గురవయ్యనాయుడు, చంద్రమౌళి, మోహన్, శ్రీధర్‌రెడ్డి, శ్రీధర్ ఎమ్మెల్యేకు అందజేశారు.

వరద బాధితులకు రూ.25వేల చెక్కు అందజేత



కోట, సెప్టెంబరు 8: పట్టణానికి చెందిన ఎస్‌కూబీ గ్రూప్ అధినేత, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ ఆదివారం విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు తనవంతు సాయంగా రూ.25వేల చెక్కును మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.సర్వోత్తమరెడ్డికి అందజేశారు.

వరద బాధితులకు దుప్పట్లు, దుస్తుల వితరణ



నాయుడుపేట, సెప్టెంబరు 8: విజయవాడ వరద బాధితులకు నాయుడుపేటకు చెందిన తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు చిందేటి సుజాత, పార్లమెంట్ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రాజేంద్ర, జె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 500 దుప్పట్లు, 500 చీరలను ఆదివారం విజయవాడలోని 56వ డివిజన్ వడ్డెర కాలనీ, తదితర ప్రాంతాల్లో అందజేశారు. మాజీ ఎంపీపీ కన్నెమ్మ, కౌన్సిలర్ సుధారాణి, శ్రీను, పవన్ చక్రవర్తి, దినేష్, అయ్యప్ప, బాబ్జి తదితరులు ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



విశ్రాంత బ్యాంక్ ఉద్యోగికి పర్సును అందిస్తున్న కంట్రోలర్ శంకరయ్య

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 8: ఆర్టీసీ కండెక్టర్ నిజాయితీని చాటుకున్నాడు. ఉదయగిరి నుంచి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో నాయుడుపేట పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి కోటయ్య నెల్లూరులో బస్సు ఎక్కాడు. నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో కోటయ్య దిగే సమయంలో తన పర్సును పోగొట్టుకున్నాడు. ఆర్టీసీ కండక్టర్ సూర్యనారాయణకు ఆ పర్సు దొరకడంతో బస్టాండ్ కంట్రోలర్ శంకరయ్యకు అందజేశాడు. అందులో ఉన్న ఫోన్ నెంబరు ఆధారంగా కోటయ్యకు సమాచారం అందించి బస్టాండ్‌లో పర్సును అందజేశారు. ఆర్టీసీ కండక్టర్ సూర్యనారాయణకు కోటయ్య అభినందనలు తెలియజేశారు.

ఇసుక అక్రమ రవాణా



గూడూరు అర్బన్, సెప్టెంబరు 8: మండలంలోని విందూరు గ్రామ సమీపం నుంచి కొందరు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు స్థానికులు చెప్పారు. ప్రస్తుతం ఇసుకను డిమాండ్ ఉండడంతో విందూరు గ్రామ సమీపంలోని పంబలేరు వాగు నుంచి కొందరు అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణ చేస్తున్నారు. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో ఇసుక అక్రమ తరలింపు జోరుగా సాగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించి ఇసుక అక్రమ తరలింపును నియంత్రించాలని కోరుతున్నారు.

వాహన చోదకుల నిరసన



నీరు కలిసిన పెట్రోల్‌ను చూపుతున్న వాహన చోదకులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 8: పెట్రోల్‌లో నీరు పోసి కల్తీ చేసి పడుతున్నారంటూ నాయుడుపేట- శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న ఓ పెట్రోల్ బంకు వద్ద శనివారం వాహనచోదకులు నిరసన తెలియజేశారు. పలువురు వాహనదారులు తమ మోటరు సైకిళ్లకు పెట్రోల్ పట్టించుకున్నారు. కొంతదూరం వెళ్లే సరికి వాహనాలు నిలిచిపోవడంతో పరిశీలించగా పెట్రోల్‌లో నీళ్లు వచ్చినట్లు గుర్తించారు. దీంతో పెట్రోల్ బంకువద్దకు చేరుకొని నిరసనకు దిగారు. దీనిపై పెట్రోల్‌బంకు సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పెట్రోల్ బంకుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మ్యాన్ మృతి

తిరుచానూరు, సెప్టెంబరు 8: తిరుపతి - రేణిగుంట రోడ్డులో ఓ ప్రైవేటు ఆస్పత్రి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వాచ్‌మ్యాన్ దుర్మరణం చెందాడు. తిరుచానూరు ఎస్ఐ సాయినాథ్ చౌదరి తెలిపిన వివరాలు ... డక్కిలికి చెందిన మునెయ్య(49) తిరుపతిలోని ఓ కార్పొరేట్ కళాశాలలో వాచ్‌మ్యాన్. శనివారం సాయంత్రం రేణిగుంట రోడ్డు నుంచి తిరుచానూరుకు వెళ్లే క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. సమీపంలోని నారాయణాద్రి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రుయాకు తరలించగా చికిత్స పొందుతూ మునెయ్య మృతి చెందాడు. మొదట గుర్తుతెలియని వ్యక్తిగా భావించగా సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో తిరుపతి జిల్లా డక్కిలి మండలవాసిగా గుర్తించారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు











తోలిమిట్టలో ఆభరణాల తయారీ వినాయక ప్రతిమ - పెద్ద శివాలయం వద్ద వైద్య వినాయక ప్రతిమ - ఎస్ఆర్ఏ సెంటర్‌లో వినాయక ప్రతిమకు ఎమ్మెల్యే పాశిం ప్రత్యేక పూజలు - తడలో వినాయక పూజల్లో యువత - నాయుడుపేట దర్గావీధిలో కొలువై ఉన్న గణపయ్యకు నెలవల సుబ్రమణ్యం ప్రత్యేక పూజలు

గూడూరు, సెప్టెంబరు 8: పట్టణంలో శనివారం వినాయకచవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు కూడళ్లల్లో వినాయక ప్రతిమలను, పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. ఇళ్లలో ప్రతిమలను ఏర్పాటు చేసి ఉండ్రాళ్లు, కుడుములు తదితర పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. పట్టణంలోని ముత్యాలపేట, రాణీపేట, తూర్పువీధి, మాళవ్యా నగర్, వీరారెడ్డిపల్లి, రాణీపేట, ఎస్ఆర్ఏసెంటర్, అశోక్‌నగర్, నలజాలమ్మవీధి తదితర ప్రాంతాల్లోని కూడళ్ల వద్ద పందిళ్లు ఏర్పాటు చేసి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు జరిపారు.

బాలాయపల్లి: మండలంలో చవితి పండుగను గ్రామగ్రామాన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద ప్రత్యేక అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వెంగమాంపురం, మల్లెమాల సహా పలు గ్రామాల్లో మండపాల వద్ద అన్నదానం చేశారు.

చిల్లకూరు: మండలంలో చవితి సందర్భంగా వినాయక ప్రతిమలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి చవితి వేడకలను ఘనంగా జరుపుకున్నారు. స్వామివారికి లడ్డూలు, ఉండ్రాళ్లు, కుడుములు నైవేద్యంగా నివేదించారు. అదేవిధంగా పలు ప్రతిమల వద్ద ఆదివారం అన్నదానం చేశారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలో చవితి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పటు వీధుల్లో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తోలిమిట్టలో బంగారు ఆభరణాలు చేస్తున్న వినాయక ప్రతిమ, పెద్ద శివాలయం వద్ద వైద్యం చేస్తున్న ప్రతిమ ఆకట్టుకుంటున్నాయి.

తడ: చవితి పర్వదినాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం వాడవాడలా ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. బజారులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఆదివారం కొన్నిచోట్ల నిమజ్జనం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాయుడుపేట: చవితి వేడుకలను శనివారం వాడవాడలా ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గావీధిలో వినాయక చవితి వేడుకల్లో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, టీ.జనార్దన రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలు కూడళ్లలో ప్రతిమలను ఏర్పాటు చేశారు. కొన్ని చోట ఉట్టి మహోత్సవాలు నిర్వహించారు.

ఓజిలి: చవితి పర్వదినాన్ని మండలంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.వాడవాడలా గణనాథుడి ప్రతిమలను ఏర్పాటుచేసి యువకులు పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా పూజలో టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.వెంకటసుబ్బయ్య, యూనిట్ ఇన్‌చార్జి కె. సత్యవరప్రసాదరావు, జయచంద్రారెడ్డి, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మండలంలోని చవితి వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ప్రధాన కూడలి ప్రాంతాలైన షార్ బస్టాండు, బాపూజీవీధి, కచ్చేరివీధి పీర్లచావడి వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వివిధ రూపాల గణనాథుడి ప్రతిమలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాపూజీ వీధిలో మొక్కజొన్న కంకులతో స్వామివారి ప్రతిమను రూపొందించారు. షార్ బస్టాండు వద్ద వినాయక ప్రతిమను శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం దర్శించుకున్నారు.

వాకాడు: భక్తుల తన్మయత్వం, యువత ఉత్సాహం, చిన్నారుల కేరింతలతో తూపిలిపాళెం తీరంలో ఆదివారం గణేశ నిమజ్జనం కోలాహలంగా జరిగింది. కోట, వాకాడు, చిట్టమూరు, నాయుడుపేట, శ్రీకాళహస్తి, గూడూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు గణనాథులను ట్రాక్టర్లలో తూపిలిపాళెం సముద్రతీరానికి తీసుకొచ్చి నిమజ్జనం చేశారు.

కోట: మండలంలో చవితి పర్వదినాలను పురస్కరించుకొని పోటాపోటీగా గ్రామోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వాకాడు మండలం తూపిలిపాళెం, కోట మండలం శ్రీనివాససత్రం సముద్రంలో ఆయా గణనాథులను నిమజ్జనం చేసేందుకు యువత కేరింతలు కొడుతూ ట్రాక్టర్ల ద్వారా విగ్రహాలు తీసుకువెళ్లారు. అదే విధంగా విద్యానగర్‌లోని విద్యాగణపతి ఆలయంలో చవితి ఉత్సవాలను పురస్కరించుకొని భారీ వినాయక ప్రతిమకు గ్రామోత్సవం నిర్వహించారు. అక్కడ నుంచి నిమజ్జనానికి తూపిలిపాళెంకు తీసుకువెళ్లారు.

పెళ్లకూరు: మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లో పందిళ్లు వేసి పలు రకాల పూలతో ప్రత్యేకంగా అలకరించి వినాయక ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శిరసనంబేడులో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మురళీకృష్ణారెడ్డి, కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వి.కళ్యాణ్‌రెడ్డి అన్నదానం చేశారు. జీలపాటూరు, చిల్లకూరు, పెళ్లకూరు, చింతపూడి, చెన్నప్పనాయుడుపేట తదితర గ్రామాల్లో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు.

డక్కిలి: మండలంలో వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం కమ్మపల్లి రోడ్డు సెంటరులోని గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఉభయదారులు డి.కోటారెడ్డి, లలితమ్మ అన్నదానం చేశారు. ఇంకా మండలంలోని కమ్మపల్లి, మోపూరు, లింగసముద్రం, పాతనాలపాడు, దగ్గవోలు గ్రామాల్లో చవితి ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకొంటున్నారు.

వెంకటగిరి: మండలంలోని పెట్లూరులో టెన్త్ విద్యార్థి ఇనుగంటి పవన్ కుమార్ పేపర్లతో 10 అడుగుల వినాయక ప్రతిమను రూపొందించాడు. దానికి రంగులు అద్ది అందంగా తీర్చి దిద్ది తమ వీధిలో ఏర్పాటు చేయగా పలువురు దర్శించుకుంటున్నారు. వెలంపాళెంలో జరిగిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే కురుగొండ్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 25, 26 తేదీల్లో వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను అంత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు కూడా చురుగ్గా సాగుతున్నట్లు తెలిపారు. కేవీకే ప్రసాదనాయుడు, పి.రాజేశ్వరరావు, పి.విశ్వనాథనాయుడు, వి.మధునాయుడు, పి. సుబ్రమణ్యం, శివ, ఎం.ఆనంద్, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.











ఓజిలిలో ఊరేగుతున్న గణనాథుడు - సూళ్లూరుపేట పట్టణంలోని బాపూజీ వీధిలో మొక్కజొన్న కంకుల వినాయక ప్రతిమ - షార్ బస్టాండు వద్ద గణనాథుడిని దర్శించుకున్న శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి - వెంకటగిరి పట్టణంలోని పెట్లూరులో పేపర్లతో రూపొందించిన గణనాథుడి విగ్రహం - విద్యానగర్‌లో పూజలు అందుకుంటున్న గణనాథుడు

నమ్మండి... ఇది తారు రోడ్డే!

పెళ్లకూరు, సెప్టెంబర్, 8: మండలంలోని పెసల గుర్రప్పతోట నుంచి పాలచ్చూరు వరకు ఉన్న తారు రోడ్డు నామరూపాల్లేకుండా పోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1992లో అప్పటి సీఎం నేదురమల్లి జనార్దన రెడ్డి ఆధ్వర్యంలో ఈ మార్గంలో ఉన్న స్వర్ణముఖి నదిపై లో లెవల్ బ్రిడ్జి నిర్మించి పెసల గుర్రప్పతోట నుంచి పాలచ్చూరు ఎస్టీ కాలనీ వరకు 5.7 కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మించారు. అయితే దశాబ్దకాలంగా రోడ్డును పట్టించుకోకపోవడంతో రోడ్డుపై తారు లేచిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి బురదమయంగా మారింది. ఈ మార్గం మీదుగా 11 గ్రామాల ప్రజలతో పాటు మేనకూరు సెజ్‌కు కార్మికులు కూడా రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా మండల కేంద్రానికి చేరుకోవడానికి 11 గ్రామాలకు ఇది ప్రధాన రహదారి. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి రోడ్డును బాగు చేయాలని గ్రామీణులు కోరుతున్నారు.



తారు లేచిపోవడంతో మట్టి రోడ్డుగా మారిన పెసలగుర్రప్పతోట దారి



మట్టి విగ్రహాలను పూజించాలంటూ సైకత శిల్పం

కోట, సెప్టెంబరు 8: కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాససత్రం సముద్రతీరంలో ఆదివారం మట్టి వినాయకులను పూజించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ చిల్లకూరు మండలం ఏరూరుకు చెందిన సైకతశిల్పి మంచాల సనత్‌కుమార్ సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ సైకత శిల్పాన్ని నిమజ్జనానికి వచ్చే పలు మండలాల భక్తులు, పలు గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. రసాయనాలతో తయారుచేసిన విగ్రహాలకు స్వస్తి పలకి మట్టి విగ్రహాలను పూజిద్దామంటూ సైకత శిల్పం ద్వారా ప్రజలకు తెలియజేశారు. దీనివలన జలచరాలతోపాటు మనిషి మనుగడను కాపాడుకుందామంటూ సైకత శిల్పి సనత్‌కుమార్ పిలుపునిచ్చారు.

నిమజ్జనానికి 70మందితో బందోబస్తు

వాకాడు, సెప్టెంబరు 8: మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో గణేశ నిమజ్జనానికి 70 మందితో బందోబస్తు కల్పించినట్టు డీఎస్పీ రమణకుమార్ ఆదివారం తెలిపారు. నిమజ్జనం సందర్భంగా నిబంధనలు పాటించాలన్నారు. 3వ రోజు నిమజ్జనానికి 5 బోట్లతో మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో తీరంలో గస్తీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ హుస్సేన్‌బాషా, వాకాడు, కోట ఎస్ఐలు నాగబాబు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయంత్రం 6 గంటల్లోగా...

కోట, సెప్టెంబరు 8: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని సముద్రతీరంలో ప్రతిమల నిమజ్జనం సందర్భంగా ఆంక్షలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కె.జయజయరావు హెచ్చరించారు. కోట మండలం శ్రీనివాససత్రం తీరంలో ప్రతిరోజు ఉదయం 6నుంచి సాయంత్రం 6 గంటలలోపు మాత్రమే ప్రతిమలను నిమజ్జనం చేయాలన్నారు. నిబంధనలను పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.



నిమజ్జన ఏర్పాట్లన పరిశీలిస్తున్న ఆర్డీవో

కులవృత్తితోపాటు పర్యావరణ హితం కోరి...

● మట్టి వినాయక ప్రతిమల తయారీలో విశ్రాంత ఎస్ఐ

రామచంద్రాపురం, సెప్టెంబరు 8: తమ తాత, ముత్తాతల నుంచి వచ్చిన కులవృత్తిని వదలేక... కాలుష్యం వెదజల్లుతున్న రంగు బొమ్మల తయారీ వద్దంటూ ఓ విశ్రాంత ఎస్ఐ నడిరోడ్డుపై మట్టి వినాయక ప్రతిమలను తయారుచేసి విక్రయించారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం మండలంలోని కమ్మపల్లెకు చెందిన త్యాగరాజులుశెట్టి తిరుపతిలో ఎస్ఐగా పదేళ్ల పాటు పనిచేశారు. తండ్రి కుండలను తయారు చేసేవారు. చిన్నప్పటి నుంచి తండ్రికి చేదోడు వాదోడుగా త్యాగరాజుశెట్టి ఉండేవారు. ఉన్నత చదువులు చదివి ఎస్ఐగా తిరుపతిలో పదేళ్లకు పైగా పనిచేశారు. ప్రతి యేడాది దీపావళికి ప్రమిదలు, మట్టి వినాయక ప్రతిమలు తయారుచేసేవారు. ఈ క్రమంలో తన కులవృత్తిని మరచిపోకుండా పర్యావరణాన్ని కాపాడటానికి వినాయక చవితి మూడురోజుల ముందు నుంచే తిరుపతి బైరాగిపట్టెడ వీధిలో తన కుటుంబ సభ్యులతో కలిసి మట్టి బొమ్మలను తయారుచేసి తక్కువ ధరకే విక్రయించారు.

వాట్సప్ గ్రూప్ అడ్మిన్‌పై పోలీసులకు ఫిర్యాదు

రామచంద్రాపురం, సెప్టెంబరు 8: ఓ దినపత్రికలో ఎమ్మెల్యే నానిపై వచ్చిన వార్తను పలువురికి ఫార్వాడ్ చేసిన వాట్సప్ గ్రూప్ అడ్మిన్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఆర్‌సీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండల పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో ఎమ్మెల్యే నాని తన అనుచరుల ద్వారా ముడుపులు తీసుకున్నారని ఓ దినపత్రిక వార్త ప్రచురించిందన్నారు. దీనిని చంద్రగిరి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ సెంథిల్‌కుమార్‌తోపాటు ఆర్‌సీపురానికి చెందిన మరో ఇద్దరు పలువురికి వాట్సప్ మెసేజ్ పెట్టారన్నారు. నానిపై తప్పుడు సమాచారాన్ని పెట్టినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమల రెడ్డి, జనార్దన చౌదరి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుమలనంబి అవతార మహోత్సవం

తిరుమల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవాచార్యులు తిరుమలనంబి 1051వ అవతార మహోత్సవం సోమవారం తిరుమలలోని దక్షిణమాడవీధిలో ఉన్న తిరుమలనంబి ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నారు. తిరుమలనంబి ఆలయంలో ఉదయం 9.30 నుంచి 16మంది ప్రముఖ పండితులు తిరుమలనంబి జీవిత చరిత్రపై ఉపన్యసించనున్నారు. శ్రీవారి భక్తాగ్రేసరుల్లో ఒక్కరైన తిరుమలనంబి శ్రీవారికి తీర్థకైంకర్యం ప్రారంభించిన విషయం తెలిసిందే.

రేపు అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుచానరూరు, సెప్టెంబరు 8: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక పవిత్రోత్సవాలను పురస్కరించుకుని 10వ తేదీ ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఉదయం 7నుంచి 9.30గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. దీంతో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు. కాగా సెప్టెంబరు 16 నుంచి 18వ తేదీ నుంచి ఆలయంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా జరగనున్నాయి. సెప్టెంబరు 15న సాయంత్రం పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 16న పవిత్రప్రతిష్ఠ, 17న పవిత్ర సమర్పణ జరగనుంది. 18న మహాపూర్ణాహుతి నిర్వహించనున్నారు.

అమ్మవారి సేవలో లోకాయుక్త

తిరుచానూరు, సెప్టెంబరు 8: తిరుచానూరులో కొలువైన శ్రీపద్మావతి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జడ్జి లక్ష్మణరెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారు కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారికి వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

పండుగలు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపడుతాయి

● ఎమ్మెల్యే విజయశ్రీ



నాయుడుపేట, సెప్టెంబరు 8: పండుగలు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతాయని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. వినాయక చవితి పండుగ పర్వదినాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం రాత్రి దర్గావీధిలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను విజయశ్రీ, పార్థసారధి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రజలు ఐకమత్యంగా పండుగ జరుపుకోవడం ముఖ్యంగా యువత ఉట్టి మహోత్సవాలు, అన్నదానాలు చేయడం అభినందనీయమన్నారు. వారి వెంట మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజేష్, చంద్రారెడ్డి, శేషం మునిగోపి, సాయిరాం కిషోర్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఔషధాలతో పని లేని వైద్యం ఫిజియోథెరపీ

నాయుడుపేట, సెప్టెంబరు 8: ఎటువంటి ఔషధాలు లేకుండా చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ఫిజియోథెరపీ ఉపశమనం కలిగిస్తుందని ఫిజియోథెరపిస్టు విజయామేరీగ్రేస్ అన్నారు. ఫిజియోథెరపి డే సందర్భంగా ఆదివారం నాయుడుపేట మండలం విన్నమాల చర్చిలో ఫిజియోథెరపిస్టు విజయమేరీ గ్రేస్‌ను స్థానికులు సన్మానించారు. ఆమె మాట్లాడుతూ భారతదేశంలో 1894లో ఫిజియోథెరపి ప్రవేశమైందన్నారు. రెండవ ప్రపంచయుద్ధంలో అనేకమంది సైనికులకు తీవ్ర గాయాలుకావడంతో వారికి సరిపడ మందులు లేకపోవడంతో ఫిజియోథెరపి ఎంతగానో ఉపకరించిందన్నారు. ఈ కార్యక్రమంలో బందిల మోహన్, శేఖర్‌బాబు, పాస్టర్ ప్రేమ్‌కుమార్, కిషోర్, శ్యామల తదితరులు ఉన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, సెప్టెంబరు 8: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసివున్న ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేకపూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తాళమ్మకు...

గూడూరు అర్బన్, సెప్టెంబరు 8: స్థానిక తాళమ్మ ఆలయంలో ఆదివారం గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

ఐకమత్యంతో సమస్యల పరిష్కారం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 8: ఐకమత్యంగా ఉంటే ఎటువంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్ అన్నారు. ఆదివారం మండలంలోని చెన్నూరులో దేవాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతల సమస్యలను పరిష్కరించేందుకు సంక్షేమ సంఘం పని చేస్తుందన్నారు. వెంకటసురేష్, మాధవయ్య, ఉదయ్‌భాస్కర్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.6.35 కోట్లు

తిరుమల, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రెండు రోజుల్లో రూ.6.35 కోట్లు లభించింది. గురువారం, శుక్రవారం కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.6.35 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక శుక్ర, శనివారాల్లో 1.42 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఈ రెండు రోజుల్లో 53,159 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా బాబు

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాంభూపాల్‌రెడ్డి, తిరుపతి నగర అధ్యక్షుడిగా చిట్టిబాబు



బాలగురువం బాబు - రాంభూపాల్‌రెడ్డి

తిరుపతి(కపిలతీర్థం/జీవకోన), సెప్టెంబరు 8: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన బాలగురువం బాబును నియమించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరునగరికి చెందిన దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డిని, నగరాధ్యక్షుడిగా గౌడపేరు చిట్టిబాబును శనివారం అధిష్ఠానం నియమించింది. కాగా, ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో బాబు మాట్లాడుతూ.. తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నవసంధి వినాయకులకు ముక్కంటి సారె



సారె తీసుకెళుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8: వినాయక చవితిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని నాలుగు మాడవీధుల్లో వెలసిన నవసంధి వినాయకులకు శనివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ముక్కంటి సారె సమర్పించారు. ఆలయంలోని అలంకార మండపంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగలవాయిద్యాల నడుమ ఊరేగింపుగా బయలుదేరి ఆయా వినాయకులకు సారె అందజేశారు. ఆలయ అర్చకులు సారెను స్వామివార్లకు అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, బొజ్జల బృందమ్మ, బొజ్జల రిషితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వికృతమాల వద్ద కార్డెన్ సెర్చ్

13 ద్విచక్రవాహనాల సీజ్



రికార్డులు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

ఏర్పేడు, సెప్టెంబరు 8: మండలంలోని వికృతమాల వద్ద ఉన్న నీలాద్రి అపార్ట్‌మెంట్స్, టిడ్కో ఇళ్ల వద్ద సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గంజాయి, మద్యం, ఇతర మాదక ద్రవ్యాలు ఉన్నాయేమోనని తనిఖీలు నిర్వహించారు. నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తుల సంచారం, అనుమానితుల కదలికల గురించి ఆరా తీశారు. సరైన రికార్డులు లేని 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు.

వాహనం సహా ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఇద్దరి అరెస్టు



పట్టుబడ్డ స్మగర్లు, ఎర్రచందనం దుంగలతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

రేణిగుంట, సెప్టెంబరు 8: మండలంలోని ఆంజనేయపురం చెక్ పోస్టు వద్ద వాహనంతో పాటు ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌ఐ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం తెల్లవారుజామున కడప - రేణిగుంట ప్రధాన రహదారిలోని ఆంజనేయపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారు. ఓ వాహనాన్ని తనిఖీ చేస్తుండగా అందులోని నలుగురు వ్యక్తులు పరారయ్యేందుకు ప్రయత్నించారు. వారిలో ఇద్దరిని టాస్క్‌ఫోర్సు పట్టుకున్నారు. వాహనంతో పాటు 12 ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆర్‌ఐ తెలిపారు.

చవితి వేడుకల్లో విషాదం

కేవీబీపురం, సెప్టెంబరు 8: మండలంలోని కర్లపూడి గ్రామంలో శనివారం సాయంత్రం చవితి వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ లోకనాథం కథనం మేరకు... గ్రామస్తులు వినాయడి ఊరేగింపు నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన సూర్య దేవుడు ముందు వెలిగే హారతిపై నీళ్లు చల్లాడు. పక్కనే ఉన్న చంద్రయ్య వారించగా పెట్రోల్ పోయమంటావా అంటూ హారతిపై పెట్రోల్ చల్లడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో చంద్రయ్య గాయపడడంతో ఆయనను శ్రీకాళహస్తి ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

కూనాటి సురేష్‌కు సన్మానం



సురేష్‌ను సన్మానిస్తున్న దశరధాచారి తదితరులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కూనాటి సురేష్‌ను ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి సన్మానించారు. పట్టణంలోని కూనాటి సురేష్ స్వగృహంలో ఆయనను కలిసి దుశ్శాలువాతో సన్మానించి ముక్కంటి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జల బాబురెడ్డి, వజ్రం కిషోర్, చింతగింజల సునీల్, అమరావతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వినాయకుడి సేవలో భానుప్రకాష్



కాపువీధిలోని వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 8: వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా పుత్తూరు పట్టణంలోని పురవీధుల్లో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. పట్టణంలోని కాపువీధి, గేటు పుత్తూరు, క్యాబిన్ సెంటర్‌లో వినాయకులను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ బీసీఆర్.యుగంధర్, మురళి, టీడీపీ రాష్ట్ర వాణిజ్య ప్రధాన కార్యదర్శి డిఎస్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు



నాగలాపురంలోని పళ్లికొండేశ్వరాలయంలో స్వామివారికి గ్రామోత్సవం



ముక్కంటి ఆలయంలో గణపతిస్వామి సన్నిధి వద్ద హోమపూజలు చేస్తున్న వేదపండితులు



నారాయణవనంలో బాల వినాయకుడికి గ్రామస్తుల పూజలు



శ్రీకాళహస్తి పట్టణం బాబుఅగ్రహారంలో ధర్మపరిరక్షణ గణపతి, ఓటేరు కాలువ వద్ద వారాహి గణపతి, కైకాలవీధిలో వాసుకి వినాయకుడు, వరదయ్యపాళెం బజారువీధిలో తండ్రి శివయ్యతో వినాయక ప్రతిమ

వాడవాడలా చవితి వేడుకలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8: శ్రీకాళహస్తి పట్టణంలో వాడవాడలా వినాయక చవితి సంబరాలు అంబరాన్నంటాయి. భక్తులు ఉదయాన్నే స్నానమాచరించి వినాయక ప్రతిమలు, పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. వివిధ పిండి వంటకాలతో వినాయకుడికి నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. ఇక పట్టణంలోని పలు వీధుల్లో ఆయా కమిటీల ఆధ్వర్యంలో వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. బాబుఅగ్రహారం కూడలి వద్ద నవభారత్ యువజన సంఘం ఏర్పాటు చేసిన ధర్మపరిరక్షణ గణపతి, ఓటేరు కాలువ వీధిలో ఏర్పాటు చేసిన వరాహ వినాయకుడు, కైకాలవీధిలో ఏర్పాటు చేసిన వాసుకి గణపతి ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ప్రధాన గణపతిస్వామి సన్నిధి వద్ద శనివారం వినాయక చవితిని పురస్కరించుకుని వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం వినాయకుడి ఉత్సవమూర్తికి పలు రకాల అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, మేళ తాళాల నడుమ స్వామివారిని చప్పరంపై అధిష్ఠింపజేసి మాడవీధుల్లో ఊరేగించారు. స్వామివారికి భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సత్యవేడు: మండలంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని గ్రామాల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేసి, విగ్రహాలను ప్రతిష్ఠించారు. చవితి వేడుకల సందర్భంగా గ్రామాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మురళి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, పట్టణానికి చెందిన ముదిరాజ్ సేవాసంఘం అధ్యక్షుడు కోళ్ళ చిన్న(మురళి) సొంత నిధులతో పలు ప్రాంతాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు విరాళాలు అందించారు. మండలంలోని మల్లవారిపాళెం వెస్ట్‌లో గణేశుడి చేతిలోని లడ్డు వేలంపాటలో రూ.లక్షా నలభైవేలు పలికింది. గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ జశ్వంత్ లడ్డూను దక్కించుకున్నారు.

వరదయ్యపాళెం: మండలంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. బత్తలవల్లం, కారిపాకం, మత్తేరిమిట్ట, తొండంబట్టు, కళత్తూరు గ్రామాల్లో ఉట్లోత్సవం నిర్వహించారు. స్థానిక బస్టాండు వద్ద సిద్ధులయ్య ఆలయంలో లోకా ఫౌండేషన్ కోఆర్డినేటర్ బొప్పన రమేష్ ఆధ్వర్యంలో, విజ్ఞాననగర్‌లో ఉపాధ్యాయులు, ఎంపీపీ భర్త దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

నారాయణవనం: మండల పరిధిలోని పాలమంగళం బీసీ కాలనీలో వెలసిన అభయహస్త బాల వినాయకస్వామికి గ్రామస్తులు పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

పిచ్చాటూరు: మండలంలోని వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. రాత్రి పురవీధుల్లో వినాయక విగ్రహాలను మంగళవాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపు నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా డీజే సౌండ్ల నడుమ యువకుల నృత్యాలతో అలరించారు.

రేణిగుంట: మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని బజారువీధి, బుగ్గవీధి, పాంచాలినగర్, గౌరీవీధి, వినాయక్ నగర్, చెక్‌పోస్టు, సీబీఐడీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు ఆకట్టుకున్నాయి. బజారువీధి, జీఎంవీధి, పాంచాలినగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకులను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి టీడీపీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు.

నాగలాపురం: సురుటుపల్లెలోని పళ్లికొండేశ్వరాలయంలో వినాయక చవితి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని మహాగణపతి స్వామికి ఉదయం పంచామృతాలతో మహాభిషేకం నిర్వహించి, ధూపదీప నైవేద్యం సమర్పించారు. సాయంతరం స్వామివారికి వివిధ పుష్పాలు, ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి మూషిక వాహనంపై అధిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్ వైద్యసేవలు



రోగులకు భోజనం వడ్డిస్తున్న రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కార్పొరేట్‌కు ధీటుగా వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అన్నారు. ఆదివారం ఏరియా ఆస్పత్రిలో ముక్కంటి ఆలయం తరఫున రోజు 200మందికి భోజనం సరఫరా చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఆస్పత్రిలో వార్డుల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2014 వరకు అడ్మిషన్ రోగులకు మాత్రమే ప్రభుత్వం నుంచి భోజన వసతి కల్పించేవారని, రోగుల సహాయకులు, ఓపీ కోసం వచ్చేవారు మధ్యాహ్నం వేళ భోజనం లేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. 2014లో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ ముక్కంటి ఆలయ అధికారులతో మాట్లాడి ప్రతిరోజు 200 మందికి ఆలయం నుంచి భోజనం సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేశారని, అయితే 2019 తరువాత వైసీపీ ప్రభుత్వం రాకతో ఆలయం నుంచి వచ్చే భోజన సరఫరా నిలిచిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరు వాత ఆస్పత్రిలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆలయ అధికారులతో మాట్లాడి భోజన సరఫరాను కొనసాగేలా చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రభుత్వాస్పత్రిని రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచే విధంగా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ముక్కంటి ఆలయ డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ పాల్గొన్నారు.

22న రిపబ్లిక్ క్లబ్ ఎన్నికలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8: శ్రీకాళహస్తి పట్టణంలో రిపబ్లిక్ క్లబ్ ఎన్నికలకు అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. అధ్యక్షుడు, కార్యదర్శి, క్లబ్ సభ్యులుగా పోటీ చేసేవారు 9, 10 తేదీల్లో నామినేషన్లు సమర్పించాలని అధికారులు తెలిపారు. 11న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. 12న ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. 22న ఆదివారం ఎన్నికలు, అదేరోజు ఫలితాలు వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



నరసింహయ్య దంపతులను సన్మానిస్తున్న గోపి

ఏర్పేడు, సెప్టెంబరు 8: రాజులపాళెం రామకృష్ణ ఆశ్రమ వ్యవస్థాపకుడు గోపి మాస్టర్ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ముచ్చివోలు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నరసింహయ్య, వేడాం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చలంను సన్మానించారు.

ఎస్‌ఐ రాజశేఖర్ బాధ్యతల స్వీకారం



నారాయణవనం, సెప్టెంబర్ 8: నారాయణవనం ఎస్‌ఐగా రాజశేఖర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తిరుపతి వీఆర్ నుంచి ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మీనారాయణ కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు.

సీఐకి సన్మానం



సీఐ జయచంద్రను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఏర్పేడు, సెప్టెంబరు 8: ఏర్పేడు సీఐగా బాధ్యతలు చేపట్టిన జయచంద్రను ఆదివారం టీడీపీ నాయకులు సన్మానించారు. వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవికుమార్, అర్జున్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 8: మండలంలోని పులివల్లం గ్రామ సమీప పొలాల్లో పేకాట స్థావరంపై ఎస్‌ఐ మల్లికార్జున్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న వయోజన విద్యాశాఖ అధికారులు

నాగలాపురం, సెప్టెంబరు 8: వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలో జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరిస్తూ ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ నోడల్ అధికారి నాగూర్ ప్రసాద్, పర్యవేక్షకులు థామస్, బాలకృష్ణారెడ్డి, శైలజ, డ్వాక్రా లీడర్లు, సంఘమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మస్థైర్యం



విద్యార్థులతో సీఐ రవినాయక్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8: మార్షల్ ఆర్ట్స్‌లో ఆత్మస్థైర్యం, శారీరక దృఢత్వం కలుగుతుందని శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ అన్నారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో కెనీ షితో ర్యూ కరాటే డొ ఇండియా ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ ఫీడింగ్ ఈయామి నేషన్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఐ అంతర్జాతీయ కరాటే పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థులను అభినందించారు. కరాటేలోని బెల్ట్ ఫీడింగ్ కార్యక్రమం చాలా ముఖ్యమైందన్నారు. కార్యక్రమంలో కోచ్ ధనుష్, కమిటీ సభ్యులు సతీష్, సురేష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

ఏర్పేడు, సెప్టెంబరు 8: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని సీఐ జయచంద్ర అన్నారు. ఏర్పేడులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లా డుతూ యువత గంజాయి, మద్యం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసు కుంటామన్నారు. గంజాయిపై ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటికే పలు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పాపానాయుడు పేటలో అక్రమాలు, అన్యాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఔట్ పోస్టు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని చెప్పారు.

ఎస్వీయూ ప్రతినిధుల అమెరికా పయనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 8: ఎస్వీయూనివర్సిటీకి చెందిన ఆరుగురు ప్రొఫెసర్ల బృందం అమెరికాకు పయనమైంది. ఈ బృందం 20 రోజుల పాటు ఆ దేశంలో పర్యటించనుంది. ఈ బృందంలో ఎస్వీయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ విజయభాస్కరరావు, వైరాలజీ ప్రొఫెసర్ హేమ, ఇంగ్లీషు ప్రొఫెసర్ సుమకిరణ్, రుసా ప్రతినిధి వంశీకృష్ణ, ఇంజనీరింగ్ ప్రొఫెసర్ రమాశ్రీ, తదితరులు ఉన్నారు. ఎస్వీయూనివర్సిటీ, అమెరికాలోని ఫార్డు యూనివర్సిటీల మధ్య ఎంటర్‌ప్రైనర్‌షిప్(బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో పరస్పర సహకారం) కల్పించేందుకు ఈనెల ఏడో తేదీన తిరుపతి నుంచి బయల్దేరి వెళ్లినట్లు సమాచారం. ఈ పర్యటన తర్వాత, అమెరికన్ యూనివర్సిటీ ప్రతినిధులు కూడా త్వరలో ఎస్వీయూను సందర్శించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ఆదిమూలానికి మద్దతుగా దళిత సంఘాల ధర్నా

సత్యవేడు, సెప్టెంబరు 8: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే ఆదిమూలానికి మద్దతుగా సత్యవేడులో ఆదివారం దళిత సంఘాల నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిమూలాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక కుట్ర పన్నారని ధ్వజమెత్తారు. బాధిత మహిళ రిలీజ్ చేసిన వీడియోపైనా, హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వీటిని ప్రభుత్వం నిగ్గు తేల్చాలన్నారు. మూడు నెలల కాలంలో ఆమె కాల్‌డేటా, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ట్రాన్సాక్షన్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన యాతాటి రమేష్‌బాబు పాత్రపై కూడా విచారణ చేపట్టాలన్నారు. అదే విధంగా ఈ ఘటనలో తెరవెనుక సూత్రధారులైన మునస్వామి యాదవ్, గిరిబాబు, బాలరాజును టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు గోవిందస్వామి, అన్బు, శేషాద్రి, థామస్, మండేలా, మాతయ్య, రమేష్, రజిని, సురేష్, కన్నప్పన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న జనసేన ఇన్‌ఛార్జి వినుత

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8: మట్టి వినాయకులను పూజించుకుని పర్యావరణాన్ని సంరక్షించుకుందామని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఆర్టీసీ బస్టాండు కూడలిలో శనివారం ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన నేతలు కోట చంద్రబాబు, చంద్రశేఖర్, కావలి శివకుమార్, తోట గణేష్, లక్ష్మి, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు వద్ద యువతరం సేవాసమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

చీరలు, మట్టి వినాయక ప్రతిమల వితరణ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి శనివారం ఊరందూరు హరిజనవాడ, ఎస్టీ కాలనీలో ఇంటింటికీ చీరలు, మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రుయాలో డాక్టర్లపై దాడి కేసులో ఏడుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8: రుయాస్పత్రిలోని డాక్టర్లపై దాడి చేసిన కేసులో తిరుపతికి చెందిన ఏడుగురిని వెస్ట్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈనెల 6వ తేదీ అర్ధరాత్రి 11.30 గంటలకు రుయా ఆస్పత్రి క్యాజువాలిటీ ముందు పీజీ డాక్టర్లపై విచక్షణా రహితంగా కొందరు దాడిచేశారు. ఈ కేసులో చింతలచేనుకు చెందిన ఏసీ మెకానిక్ షేక్షావలి, షేక్ చాంద్‌బాషా, మునికృష్ణ వసంత్, జె.కృష్ణబాబు, ఎస్.మణి, పి.శివకుమార్, బి.సాయికుమార్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాలతో డీఎస్పీ వెంకటనారాయణ, వెస్ట్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి చింతలచేను రైల్వే ట్రాక్ వద్ద అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటనారాయణ మాట్లాడుతూ.. అనవసరంగా ఆస్పత్రుల్లో డాక్టర్లపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ రామకృష్ణ, సిబ్బందిని అభినందించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డ్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 198066

TOURS & TRAVELS
శ్రీరామమూర్తి యాత్ర స్పెషల్ : తిరుపతి-రామేశ్వరం, కన్యాకుమారి, పళని, శ్రీరంగం, జంబుకేశ్వరం, తిరువన్నామలై. మొత్తం 11 ప్రదేశాలు. 4-10-2024వ తేది, 5 రోజులు, 5500. సంప్ర. : 9441891921
AJT - 4256

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి